సత్ - చిత్ - ఆనంద్

అది సంధ్యా సమయం

శంకరానందులవారి ఆశ్రమం

ఆకాశంనుండి నీలి వర్ణం, అశ్వత్థ, నారికేళ, వటవృక్ష శాఖలను చీల్చుకుంటూ కిందకు జాలువారుతోంది.

ఎంతోకాలంగా అక్కడ జరిగే పాపపుణ్యాలకు మౌనసాక్షుల్లా నిలిచివున్నాయి ఆ వృక్షాలు.

విశాలమైన ఆవరణ. రెల్లుగడ్డితో కప్పిన కుటీరాలు దాదాపు ముప్పయ్ వరకూ వుంటాయి. ప్రతి కుటీరం మీదకూ పూలతీగెలు పాకి ఉన్నాయి.

ఆ కుటీరాలకు పెడగా, పూల మొక్కల మధ్యగావున్న భవనం శంకరానందస్వామి వారిది. అది ఆలయ ఆకారంలో వుంది. దానిపేరు ఆనంద నిలయం. ఆ భవనానికి ఇరుపక్కలా, అదే ఆకారంలో రెండు చిన్న భవనాలు ఉన్నాయి. అవి రెండూ ఒకే సైజులో కవలపిల్లల్లా వున్నాయి. వాటిలో శంకరానందులవారి ప్రియశిష్యులు చిదానందులూ, సదానందులూ ఉంటున్నారు.

సదానందులవారు పూర్వాశ్రమంలో ధనిక భూస్వామి. సంతానం లేదు. భార్య చనిపోయింది. సంతానయోగం లేదని డాక్టర్లు చెప్పారు. గుంట దగ్గర నక్కలా తన చావుకు ఎదురు చూస్తూ కూర్చున్న దాయాదులకు బుద్ధి చెప్పాలనుకొన్నాడు. మొత్తం ఆస్తి దానధర్మాలకు ఉపయోగించి తను సన్యాసం పుచ్చుకొన్నాడు. శంకరానందుల స్వామివారి ఆశ్రమం చేరుకున్నాడు.

చిదానందుల వారు గత చరిత్రలో ఒక మిల్లు యజమాని. పెద్ద కుటుంబానికి వారసుడు. వ్యాపారంలో కొంత నష్టం వచ్చింది. ఐ.పి. పెట్టేసి, మిగిలిన ఆస్తిపాస్తులు భార్యాబిడ్డలకు అప్పగించి ఆశ్రమ జీవితాన్ని ఆశ్రయించాడు.

సదానందుల వారికీ, చిదానందుల వారికీకూడా ప్రియశిష్యులు ఉన్నారు. ఒకడి పేరు సత్తు. దయానందుల వారి ప్రియ శిష్యుడు. మరొకడి పేరు చిత్తు. చిదానందుల వారి ప్రియతమ శిష్యుడు. వారికి ఆ పేర్లు సాక్షాత్తు శంకరానంద స్వాముల వారే పెట్టారు. వారిద్దరూ తమతమ గురువుల భవనాల్లోనే వుంటూ వారి సేవలు చేసుకుంటున్నారు.

ఆ రోజున

ఆ సాయం సమయాన

శంకరానందస్వామివారి దర్శనార్థం వడ్రంగి మల్లయ్య ఆశ్రమానికి వచ్చాడు.

వస్తూ వస్తూ తన పనితనమంతా ఉపయోగించి నగిషీలు చెక్కి తయారుచేసిన పావుకోళ్లు రెండు జతలు పట్టుకొచ్చాడు. వాటిని స్వామివారికి సమర్పించి తరించాలనేది తన చిరకాల వాంఛ అని చెప్పాడు. ఆ వాంఛను నెరవేర్చుకోవడానికే వచ్చానని చెప్పాడు. కాని మల్లయ్యకు స్వామివారి దర్శనభాగ్యం లభించనేలేదు. మనసు చిన్నబుచ్చుకున్నాడు. సత్తూ, చిత్తూ పోటీలు పడి అతడిని ఓదార్చారు. ఆయన తర్వాత ఆయనంతటివారు, ఒకరు కాదు, ఇద్దరున్నారని తెలుసుకుని ఊరట చెందాడు వడ్రంగి మల్లయ్య.

ఆమాటకొస్తే స్వామివారి దర్శనం ఎల్లవేళలా అందరికీ లభించదని తెలుసుకున్నాడు.

తపోనిష్టా గరిష్టులైన శంకరానందులవారి దర్శనం సామాన్యులకు దుర్లభం. సంవత్సరంలో ఒక్కరోజు మాత్రమే, భక్తకోటికీ, పామరజనానికీ, శిష్యగణానికీ దర్శనం లభిస్తుంది. కానీ గత మూడేళ్లుగా ఆ దర్శనంకూడా లభించడం లేదు. కారణం ఎవరికీ తెలియదు.

ఆ పరమ రహస్యం ఆయన ప్రియశిష్యులైన సదానందులకూ, చిదానందులకూ తప్ప మరో ప్రాణికి తెలియదని ఆశ్రమవాసుల అభిప్రాయం.

శంకరానందస్వామి వీరిద్దర్నీ ఉప పీఠాధిపతులుగా అంగీకరించారు. కాని వీరిద్దరిలో తన పీఠాన్ని అధిష్టించే అర్హత ఎవరికి వుందో వారింకా నిర్ధారించుకోలేదు.

కాషాయ వస్త్రాల్లో యువకులు, వృద్ధులు, గడ్డాలు జడలు కట్టిన జుట్టులు, పెరిగిన గోళ్లు, దర్భలు, విభూతి, పురాణపఠనం, వేదఘోష, పులిచర్మాలు, జింకపిల్లలు, పక్షుల కలకలారావాలు, సందర్శకుల సందడి - ఇదీ ఆశ్రమ వాతావరణం.

అహాన్ని చంపుకొని, ఐహికాన్ని ఆముష్మికంకోసం త్యజించి, నశ్వర శరీరాన్ని పరమాత్మ సేవకు అంకితం చేసి సదానందులూ, చిదానందులూ ఆశ్రమవాసుల అంతరంగాలను దోచుకున్నారు.

శంకరానందస్వామి వారి మహాసమాధి తర్వాత ఆ పీఠాన్ని అధిష్టించే అర్హత ఆ ఇద్దరిలో ఎవరికి ఉంది అనేది ఇటీవల ఆశ్రమవాసుల్లో తలెత్తిన పెద్ద ప్రశ్న. కాని ఆ మాట పైకి అనే సాహసం ఎవరిలోనూ లేదు.

మూడేళ్లుగా శంకరానందుల దర్శనం లేదు. కారణం తెలియదు. ఆశ్రమాన్ని దర్శించడానికి విచ్చేసిన భక్తులు వీరిద్దరిలో ఎవరి పాదపూజ చేసి తరించాలో అర్థంకాక అయోమయంలో పడిపోతున్నారు.

సందర్శకులలో బయలుదేరిన ఈ సందేహం ఆశ్రమవాసుల మనసుల్లో ప్రవేశించి పురుగులా తొలచసాగింది.

ఆశ్రమ జీవితంలో అలజడి బయలుదేరింది. గుసగుసలు ప్రారంభం అయ్యాయి. ఆ వాతావరణం ఆశ్రమవాసుల మనసులను అశాంతికి గురిచేస్తున్నది.

శ్రీ శ్రీ సదానందులవారూ, చిదానందులవారూ మాత్రం ఈ తుచ్ఛమైన కోరికలకు అతీతంగా, నిర్వికారంగా, ప్రశాంతంగా ఉంటున్నారు.

శంకరానందులవారి పీఠాన్ని ఆక్రమించుకొనే అధికారం సదానందులవారిదేనని

కొందరంటే, కాదు చిదానందులవారిదేనని మరికొందరు అంటున్నారు. పాదపూజ స్వీకరించే అర్హత సదానందులవారికే ఉందని సత్తు అభిప్రాయపడితే, కాదు ఆ అర్హత చిదానందులవారికే వుందని చిత్తు అభిప్రాయపడుతున్నాడు.

చివరకు ఈ అభిప్రాయ భేదాలు, వాదోపవాదాల రూపం ధరించాయి. అది అంతటితో ఆగలేదు. చూస్తుండగానే ఆశ్రమం నిలువునా రెండుగా చీలిపోయింది.

ఆశ్రమ వాతావరణం ఆముష్మిక వైరంతో కలుషితం అయిపోయింది. లుకలుకలు బయలుదేరాయి.

సదానందులవారి అనుచరులకు, వారి ప్రియశిష్యుడు సత్తు సారథ్యం వహించాడు. అలాగే చిదానందులవారి శిష్యగణానికి చిత్తు నాయకత్వం వహించాడు.

శ్రీ శ్రీ శంకరానందస్వామివారు తమ తదనంతరం తమ పీఠం సదానందుల వారికే సంక్రమించాలని అభిప్రాయపడ్డారని, ఆ రహస్యాన్ని అప్పటికే ఆయన తమ గురువుగారి చెవిలో ఊదారనీ సత్తు బహిరంగంగానే ప్రచారం ప్రారంభించాడు.

అది విన్న చిత్తుకు చిర్రెత్తుకొచ్చింది. అతడూ తక్కువేమీ తినలేదు. తమ గురువుగారైన చిదానందులవారే ఆ పీఠానికి అర్హులనీ, వారికే ఆ పీఠం ఇవ్వడానికి నిర్ణయం తీసుకున్నామనీ తనముందే తమ గురువుగారితో సాక్షాత్తూ శివానందులవారే చెప్పినట్టు ప్రచారం సాగించాడు.

ఇరుపక్షాల ప్రచారం ఊపు అందుకుంది.

దీంతో ఆశ్రమ సందర్శకులు ఇరుకులో పడిపోతున్నారు.

ఆ ఇద్దరిలో ఎవరికీ పాదపూజ చెయ్యాలో నిర్ణయించుకోలేక సతమత పడిపోతున్నారు.

సత్తు, చిత్తుల బాధ భరించలేక కొందరు ఎవరికీ పూజ చెయ్యకుండానే తిరిగిపోతున్నారు.

కొందరు ఇంతదాకా వచ్చాక "ఏ పుట్టలో ఏ పాము వుందో ఎందుకైనా మంచిది" అని భావించి ఇద్దరికీ పాదపూజలు చేసి తేలికపడిన మనసులతో తిరిగి వెళ్తున్నారు.

ఏది ఏమైనా ఆశ్రమ వాతావరణం గాడిపొయ్యిలా కుమలకపోయినా మురుగు గుంటలా లోలోపలే కుళ్ళిపోతున్నది.

ఈ పరిస్థితుల్లో వచ్చాడు వడ్రంగి మల్లయ్య పావుకోళ్ల జతలు తీసుకొని ఆశ్రమానికి. శంకరానంద స్వాములవారి పాదధూళి స్వీకరించి జన్మరాహిత్యం పొందాలనే గంపెడాశతో వచ్చాడు. ఆ ఆశ నిరాశే అయిందని బోలెడంత బాధపడిపోయాడు. స్వామివారి దర్శన భాగ్యం లభించనందులకు కన్నీళ్ల పర్యంతం అయ్యాడు.

బాధపడిపోతున్న మల్లయ్యను సత్తూ, చిత్తూ పోటీలుపడి ఓదార్చారు. "మా గురువుల పాదపూజ చేసుకొని కైవల్యం పొందండి" అన్నాడు సత్తు. "మా గురువుల పాదధూళి స్వీకరించి జన్మరాహిత్యం పొందవయ్యా మల్లయ్యా!" అన్నాడు చిత్తు.

ఆయన తర్వాత, ఆయనంతటివారు ఒకరుకాదు ఇద్దరు ఉన్నారని తెలుసుకొని ఊరట చెందాడు వడ్రంగి మల్లయ్య.

తమ తమ ప్రియశిష్యులు వెంటరాగా సదానందులవారూ, చిదానందులవారూ భక్తుల పూజలు స్వీకరించడానికి ప్రార్థనామందిరానికి విజయం చేశారు.

ఇద్దరూ పక్కపక్కనే ఉన్న ఉన్నత ఆసనాల మీద ఆసీనులయ్యారు.

సదానందుల వారు భక్తకోటిని సంబోధించి అన్నారు:- "భక్తులారా! సామాన్య మానవుడికి మహామాయను జయించడం సాధ్యమయ్యేపని కాదు. అందుకు కఠోర సాధనా, దీక్షా కావాలి. ఈ శరీరం నవరంధ్రాలతో కూడిన తుచ్ఛమైన తోలుతిత్తి. ఐహిక వాంఛలకు దూరంగా వుండాలి. ఈర్ష్యాద్వేషాలకూ, సుఖదుఃఖాలకు అతీతంగా వుండాలి. అప్పుడే పశుప్రాయుడైన మానవుడి ఆత్మ, తనను చుట్టివేసిన మహామాయనుంచి విముక్తి పొందగలుగుతుంది. విముక్తమైన ఆత్మ, ఆ సత్ - చిత్ - ఆనంద స్వరూపుడైన భగవంతుడి సాన్నిధ్యాన్ని చేరుతుంది. ఐహిక సుఖాలనుంచి విముక్తమైన ఆత్మకు ఆముష్మిక పరమానందం లభిస్తుంది. అందుకే ముందుగా ఈ తుచ్ఛమైన వాంఛలనూ, ఈర్ష్యాద్వేషాలనూ జయించాలి" అంటూ అనర్గళంగా అర్ధగంట ఆత్మ, పరమాత్మల గురించి బోధించారు.

ఆ బోధ పూర్తి అయీ, కాకుండానే చిదానందుల వారు అందుకొన్నారు:- "భక్తజనులారా! ఐహిక ప్రలోభాలకు లొంగకూడదు. అన్నింటికంటే భయంకరమైన ప్రలోభం స్త్రీ శరీరం. ఆ శరీరం ఒక పాపకూపం. ఆ కూపంలో ఒకసారి పడితే మళ్లీ పైకి రావడం అసాధ్యం. స్త్రీ శరీరం కాముని నివాసం. ఆమె కళ్లల్లో విషం ఉంది. మాదక పదార్థం వుంది. ఆమె చూపుల్లో కోడె నాగులు ఉన్నాయి. వాటి కాటుకు దూరంగా వుండండి. అప్పుడే మీ ఆత్మ పవిత్రంగా వుంటుంది. పాపం అంటని ఆత్మ పరమాత్మ స్వరూపం. సచ్చిదానంద స్వరూపం. స్త్రీ శరీర ఆకర్షణలో పడి మీ ఆత్మను అపవిత్రం చేసుకోకండి. అది గ్రహించిన మా గురువులు ఈ ఆశ్రమంలో స్త్రీలకు స్థానం కల్పించలేదు" అంటూ స్త్రీ శరీరం ఎంత మురికి కూపమో వివరించి బోధించారు సదానందులవారు.

అంతవరకు భక్తుల మధ్య కూర్చుని గురువుల బోధల్ని ఏకాగ్రతతో విన్న వడ్రంగి మల్లయ్య లేచివచ్చి గురువుల ముందు ముకిళిత హస్తాలతో నిలబడ్డాడు.

గురువులిద్దరూ తృళ్లిపడ్డట్టయి అతడ్నే కన్నార్పకుండా చూడసాగారు. ఏదో గుర్తు చేసుకోవడానికి ప్రయత్నించసాగారు.

ఇదేమీ గమనించని మల్లయ్య "స్వాములూ! ఈ భక్తుడు సమర్పించుకుంటున్న ఈ చిరుకానుకల్ని స్వీకరించి నన్ను తరింపచెయ్యండి" అని రెండు జతల పావుకోళ్లు వారిముందు వుంచి వెనుతిరిగి వెళ్ళిపోయాడు.

గురువులిద్దరూ తమ తమ ఆలోచనల్లో వుండి అతడ్ని ఆశీర్వదించడం మర్చిపోయారు. అతడు వెళ్లిపోగానే ఒకరి మొహంలోకి ఒకరు చూసుకున్నారు. ఇద్దరి ముఖాల్లో ఒకటే ప్రశ్న! పెద్ద ప్రశ్న!

మల్లయ్య సమర్పించిన పావుకోళ్లు శిష్యులతోపాటు గురువులనుకూడా అమితంగా ఆకర్షించాయి. రంభనైనా చూచి చలించని మునిముచ్చుల మనసులు ఆ పావుకోళ్లను చూచి చలించాయి.

ముందుగా సదానందులవారు ఆసనం దిగినవారై గంభీరంగా ముందుకువచ్చి పావుకోళ్లలో ఒక జత ధరించారు. సత్తూ మొదలుగాగల శిష్యపరమాణువులు వెంట నడవగా "రాజు వెడలె - రవితేజములలరగ" అన్నట్టు పావుకోళ్ళు లయబద్ధంగా టక టక శబ్దం చేస్తుంటే చిద్విలాసంగా చిరునవ్వులు విసురుతూ తమ కుటీరం కేసి నడిచారు

సదానందులవారు.

చిదానందులు ఆసనం దిగారు. చిత్తు అప్పటికే రెండో జత పావుకోళ్లు తుడిచిపట్టుకొని సిద్ధంగా నిలబడి ఉన్నాడు. గురువుగారి పాదాలకు స్వయంగా పావుకోళ్లు తొడిగాడు. చిదానందులు శిష్యగణం వెంటరాగా చిరునవ్వులు చిందిస్తూ ముందుకు అడుగులు వేశారు.

నాలుగు అడుగులు వేశారో లేదో చిదానందులవారు బిళ్లబీటుగా విరుచుకు పడి పోయారు. శిష్యులు అవాక్కయి శిలాప్రతిమల్లా నిలబడిపోయారు. చిత్తు తన మూర్ఛ తాను తెలుసుకున్నవాడై చివుక్కున గురువుగారి పక్కన కూలబడ్డాడు. అప్పటికే చిదానందులు లేచి కూర్చున్నారు పాదం పట్టుకొని. చిత్తు గురువుగారి పాదాల్ని గుండె లకు ఆనించుకొని నిమరసాగాడు. శిష్యగణం చుట్టూచేరి సపర్యలు చెయ్యసాగారు.

ఆయన అలా పడడం చూసిన సదానందుని శిష్యులు కొందరు ముసిముసిగా నవ్వుకుంటూ వెళ్ళడం, చిదానందులవారి శిష్యపరమాణువుల్లో కొందరు చూశారు. కసిగా పెదవులు కొరుక్కున్నారు.

అసలు ఇంతకూ ఏం జరిగిందంటే - చిదానందులవారి ఎడం పాదం కింద పావుకోడు బెడిసి పక్కకు తప్పుకోవడంతో పాదం మడతపడింది. ఒక్కసారిగా విరుచుకుపడిపోయారు.

ఆ రెండో రోజున-

కిందటి రోజు జరిగిన అవమానంతో దహించుకుపోతున్న చిదానందులవారు ముందుగా లేచి పావుకోళ్ళు ధరించి శిష్యగణం వెంటరాగా పావుకోళ్లు టకటకలాడించు కుంటూ పెద్ద పెద్ద అంగలు వేస్తూ తమ కుటీరంకేసి వెళ్ళిపోయారు.

అలా వెళ్తున్న చిదానందుల్ని సదానందులు జాలిగా చూశాడు. సదానందులు ఆసనం దిగి పావుకోళ్లు ధరించి శిష్యులకేసి చూస్తూ చిద్విలాసంగా నవ్వాడు. ముందుకు రెండడుగులు వేశాడో లేదో జర్రున జారి వెల్లికిలా పడిపోయాడు. ఎడంకాలు పావుకోడు ఎగిరి అల్లంత దూరంలో పోయి పడింది.

"ఇంకానయం ఎవరికీ తగల్లేదు" అనుకున్నారు పావుకోడు దెబ్బతప్పించుకున్న శిష్యులు.

చిదానందుల కంటే సదానందులు స్థూలకాయుడు. వెంటనే లేచి కూర్చోలేక పోయాడు. కొద్ది క్షణాలు పడ్డవాడు పడ్డట్టే నేలకరచుకొని వుండిపోయాడు. శిష్యగణం స్థాణువుల్లా నిలబడిపోయారు. సదానందులు లేవడానికి ప్రయత్నించాడు. కాని అతని శరీరం సహకరించలేదు. సత్తు గురువుగార్ని అపురూపంగా పట్టుకొని లేవదీసి కూర్చోబెట్టాడు.

చిదానందులవారి శిష్యులు కొందరు అది చూసి వెకిలిగా నవ్వారు. మరికొందరు తిరిగి తిరిగి చూస్తూ వెళ్ళారు. అంతేకాదు, చిదానందులవారుకూడా శిష్యులతోపాటు వెనక్కు తిరిగి చూశారు. ఆయన పెదవులమీద హాసరేఖలు కన్పించీ కన్పించనట్టుగా కన్పించాయి. ఆ చిరుదరహాసం విషం పూసిన బాణంలా సదానందుని గుండెకు గుచ్చుకుంది.

దెబ్బతిన్న పులిలా సదానందులు తన కుటీరంలో అటూ ఇటూ తిరుగుతున్నాడు.

సత్తు గురువుగారు వదిలేసిన పావుకోళ్లను తీసుకొని మిగతా శిష్యగణంతో కుటీరంలోకి ప్రవేశించాడు. శిష్యుల్ని చూసిన గురువు పచార్లు ఆపి ఆసనం మీద కూర్చు న్నాడు. శిష్యులు గురువుగారి పాదాలముందు నేలమీద కూర్చున్నారు. తమ గురువుకు జరిగిన అవమానానికి క్రోధం వెళ్లగక్కారు. కొందరైతే ప్రతీకారం చేసి తీర్తామని ప్రతిజ్ఞలు చేశారు. సత్తు మాత్రం మౌనంగా కూర్చున్నాడు. ఏదో ఆలోచనరాగా పావుకోళ్లను చేతు ల్లోకి తీసుకొని తిప్పి తిప్పి చూశాడు.

"ఇవి మన గురువుగారివి కావు!" పెద్దగా అరిచాడు.

"అవునవును." చూడకుండానే మిగతా శిష్యులు సత్తుకు వంతపాడారు.

"ఏవీ, ఇలా ఇవ్వు." సదానందులు సత్తు చేతిలోని పావుకోళ్లు అందుకొని పరి శీలించి చూశాడు.

ఎడంకాలు పావుకోడు మీద బొటనవేలు దగ్గిర వుండే పావు కొంచెం పెడగా ఉంది. అందువల్ల కోడు పక్కకు తప్పుకొంటున్నదనీ, పాదం మడత పడుతున్నదనీ అర్థం అయింది.

"అవును, ఇవి నిన్న నేను ధరించినవి కావు" అన్నారు గురువులు సాలోచనగా.

"అవును స్వామీ! నిన్న వారు ధరించినవి ఇవే. అందుకే నిన్న ఆయన పడిపోయారు."

"పొరపాటున చిదా నా పావుకోళ్లు వేసుకెళ్లినట్టున్నాడు." ఆలోచిస్తూ అన్నాడు సదానందులు.

"పొరపాటున కాదు గురువుగారూ! కావాలనే చేశారు. అందుకే ముందుగా లేచి వెళ్ళిపోయారు. నిన్న జరిగిన దానికి ప్రతీకారంగా ఇవ్వాళ ఆ పని చేశారు. మిమ్మల్ని చూసి ఎలా నవ్వారో చూశారుగా! అసలు ఈ జిత్తులన్నీ ఆ చిత్తుగాడివే!"

"కావాలనే చేశాడంటావా సత్తూ!" అవునని మనసు చెబుతున్నా అడిగాడు సదానందులు.

"అవును గురూజీ! ఇంకా సందేహం ఎందుకు? అది కావాలని చేసిన పనే! పావుకోళ్లు టకటకలాడించుకుంటూ ఎలా నడిచి వెళ్ళాడో చూశారుగా! నిన్న పడిపోయినవాడు అంత ధైర్యంగా నడవడం..."

"ఆ గురువులు మిమ్మల్ని కావాలనే అవమానపర్చారు మోసంతో. చూస్తుండండి ప్రతీకారం ఎలా తీర్చుకుంటామో" అని శిష్యుల కంఠాలు ఒక్కసారిగా పలికాయి.

సదానందులవారు తొందరపాటు మంచిది కాదని శిష్యగణాన్ని హెచ్చరించారు.

ఆ రోజునుంచి సదానందులవారు మల్లయ్య ఇచ్చిన పావుకోళ్లను వాడలేదు.

చిదానందులు మాత్రం పావుకోళ్లను టకటకలాడించుకుంటూ తిరుగుతున్నారు. ఆ పావుకోళ్ల టకటకలు సదానందుల శిష్యుల తలల మీద సుత్తిదెబ్బల్లా పడుతున్నాయి.

చిత్తు సత్తుకేసి విజయగర్వంతో చూస్తూ భుజాలు ఎగరేసుకుంటూ తిరుగుతున్నాడు. సత్తుకు అరికాలు మంట నెత్తికి పాకుతున్నది. గురువులు మాత్రం ఏమీ జరగనట్టే నిర్వికారంగా ఉన్నారు.

రోజూ ప్రార్థనా మందిరంలో పక్కపక్క ఆసనాలను అధిష్టించి పాదపూజలు అందుకుంటున్నారు.

ఆరోజు కొత్త పావుకోళ్లు ధరించి శిష్యగణంతో ప్రార్థనా మందిరానికి బయలుదేరారు చిదానందులవారు. కుటీరం దాటి రెండడుగులు వేశారో లేదో మళ్లీ ఎడంకాలి పావు కోడు పక్కకు తప్పుకుంది. అంతే! విరుచుకు పడిపోయారు. మడం బెణికింది. పాద పూజకు అతికష్టంమీద శిష్యుల భుజాల మీద చేతులు వేసి నడిచి వెళ్ళారు కుంటుకుంటూ.

ఇంతకూ ఏం జరిగిందయ్యా అంటే-

ముందు రోజు రాత్రి అందరూ గాఢ నిద్రలో ఉన్న సమయం చూసి సత్తు చిదానందుల ఆశ్రమంలోకి పిల్లిలా జొరబడ్డాడు. పావుకోళ్లు మార్చాడు.

బెణికిన పాదం సలుపుతూ వుంటే, చిదానందులు అశాంతిగా ఆసనం మీద కూర్చొని వున్నాడు. కొత్త పావుకోళ్లు టకటకలాడించుకుంటూ చిరునవ్వులు చిందిస్తూ పాదపూజకు విచ్చేసిన సదానందుల్ని చూడగానే చిదానందుల ముఖం మసిపూసినట్టుగా నల్లబడింది. ఏం జరిగిందో గ్రహించాడు. వారి శిష్యపరమాణువుల తలలు అవమాన భారంతో వంగిపోయాయి.

చిత్తుకైతే మెడకాయ మీది తలకాయ ఎగిరిపోయినట్టే ఉంది.

సత్తు ఆనందం పట్టలేకుండా ఉన్నాడు. గురువుగారు పావుకోళ్లు వదలగానే ఒళ్లో పెట్టుకొని కూర్చున్నాడు.

గురువుగారు ఆసనం దిగగానే పరిగెత్తుకెళ్ళి స్వయంగా వారి పాదాలకు తొడిగాడు.

అది చూస్తున్న చిత్తు గుండెల్లో తాటాకుల మంటలు నాలుకలు చాచాయి.

కొన్ని రోజులు గడిచాయి.

ఇరుపక్షాల మధ్యా ఆముష్మిక వైరం విజృంభించింది.

సత్తు గురువుగారి పావుకోళ్ళను కనిపెట్టుకొని వుంటున్నాడు. వాటిని క్షణం వదలడం లేదు. చిత్తు అవకాశంకోసం పొంచి వున్నాడనే విషయం గ్రహించాడు సత్తు.

సత్తు వ్యవహారం చిదానందుల శిష్యులకు పుండును కెలికి కారం కూరినట్టుగా ఉంది.

ప్రశాంత తటాకంలాంటి ఆశ్రమ వాతావరణం చూస్తుండగానే అగ్నిగుండంలా మారిపోయింది. ఆ అగ్ని చల్లారకుండా ఇరుపక్షాలూ ప్రయత్నిస్తూనే ఉన్నాయి. ఏదో రూపంలో ఇంధనం, సమిధలూ ఆ అగ్నికి అందిస్తూనే ఉన్నాయి.

ఇరుపక్షాలవారూ ఈర్ష్యాద్వేషాలతో రగిలిపోయారు. వారి కళ్ళల్లో తేళ్లు అశాంతిగా కొండేలు ఎత్తుకొని తిరుగుతున్నాయి.

గుండెల్లో విషనాగులు బుసలు కొడ్తున్నాయి.

ఒకరోజు సత్తుగాడి పట్టు కౌపీనం మాయం అయింది.

అది ఎవరి పని అయివుంటుందో గ్రహించాడు సత్తు.

ఆ సాయంకాలం ప్రార్థన ముగిశాక, తన కుటీరానికి తిరిగి వస్తున్న సత్తు రావిచెట్టు దగ్గర ఏదో చేస్తున్న చిత్తును చూసి ఆగాడు. రావిచెట్టు తొర్రలో దేన్నో కుక్కుతున్నట్టు అన్పించి ముందుకు వెళ్ళాడు. తీరా చూస్తే అది తన పట్టు కౌపీనమేనని గ్రహించాడు సత్తు.

అంతే! చిరుతపులిలా చిత్తుమీదకు లంఘించాడు.

మోకాళ్ల వరకూ వున్న చిత్తు ధోవతిని లాగాడు. సర్రున చింపాడు అడ్డంగా.

ముక్కలు ముక్కలుగా చించి అవతలకు పారేశాడు.

చిత్తు సత్తు ధోవతిలాగి, ఉండగా చుట్టి దూరంగా పొదల మీదకు విసిరేశాడు.

ఇద్దరూ కలబడ్డారు.

సత్తు చిత్తుకంటే బలంగా, పుష్టిగా వుంటాడు.

సత్తుగాడి దెబ్బలకు చిత్తుగాడు, చిత్తుగా చిత్తయిపోయాడు. చిత్తుగాడిని వెల్లకిలా పడేసి గుండెలమీద కూర్చొని పీకపట్టుకున్నాడు సత్తుగాడు.

చిత్తు కాళ్లూ చేతులూ ఆడిస్తూ 'కీచు కీచు'మని అరుస్తున్నాడు.

ఎటునుంచి వచ్చారో, ఎక్కడినుంచి వచ్చారో రంగప్రవేశం చేశారు చిదానందుల వారు. తన ప్రియ శిష్యుడిపై జరుగుతున్న దౌర్జన్యం కళ్ళారా చూశారు. సహించ లేకపోయారు.

చేతిలో వున్న కమండలంతో సత్తు కణతలమీద బలంకొద్దీ బాదాడు చిదానందుడు.

అంతే! కెవ్వున అరిచి గింగిరాలు తిరిగి నేలకు కరుచుకుపోయాడు సత్తు.

చేతిలో తాటిమట్ట పట్టుకొని అప్పుడే రంగంలో ప్రవేశించిన సదానందుడు ఆ దారుణ దృశ్యం చూశాడు. ఉగ్రరూపం ధరించాడు. తాటిమట్టతో చిత్తును చితకబాదాడు. స్పృహపోయేదాకా కొడుతూనే వున్నాడు.

సత్తూ, చిత్తూ పక్కపక్క పడి ఉన్నారు.

ఇరువర్గాల శిష్యగణం బరిలోకి దిగింది.

చేతికి అందిన ఆయుధాలతో తలపడ్డారు.

అతిపవిత్రమైన ఆ ఆశ్రమ వాటికలో అశ్వత్థ వటవృక్షాల కిందగా రక్తపుటేరు ప్రవహిస్తోంది.

వెండి వెన్నెల వెలుగులో ఎర్రటి మానవరక్తం వింతగా మెరుస్తోంది.

వాతావరణమంతా హాహాకారాలతో భీతి కొలుపుతున్నది.

ఆ ఘోరకలిని చూడలేనట్టుగా చందమామ మబ్బుల చాటున ముఖం దాచుకున్నాడు.

ఎర్రటి రక్తంతో స్నానించిన నాలుగు పావుకోళ్ళు నిర్లిప్తంగా, నిర్వికారంగా ఆకాశంకేసి చూస్తున్నాయి.

తెల్లవారి ఆశ్రమంలో కాషాయ వస్త్రాలకంటే ఖాకీ వస్త్రాలే ఎక్కువగా కన్పిం చాయి.

తెల్లవారేసరికే చిదానందులూ, సదానందులూ ఆశ్రమంనుంచి పరారయ్యారు.

అంతేకాదు, పావుకోళ్లను సమర్పించిన వడ్రంగి మల్లయ్యకానీ, ఆ ఆశ్రమ వ్యవస్థాపకులైన శంకరానందులవారుకానీ మళ్లీ ఆ ప్రాంతాలలో కన్పించలేదు.

(ఇండియా టుడే 21.8.94)